సాక్షి
పార్వతీపురం మన్యం
శనివారం । 1 । ఏప్రిల్ । 2023



నదిలో గల్లంతైన యువకుడి మృతి

నాగావళి నదిలో గల్లంతైన యువకుడు అన్న కార్తీక్(17) మృతదేహం వీరఘట్టం మండలం కడకెల్ల సమీపంలోని నది తీరంలో శుక్రవారం లభ్యమైంది. - 8లో



ఆయువు తీసిన అక్రమ క్వారీ

టీడీపీ నేతకు చెందిన అక్రమ క్వారీ ఓ విద్యార్థి మృతికి కారణమైంది. ఆ కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చింది. - 8లో

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

జియ్యమ్మవలస: మండలంలోని జీజేపురం, జియ్యమ్మవలసలోని అంగన్‌వాడీ కేంద్రాలను పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్ శుక్రవారం పరిశీలించారు. చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారంపై వారి తల్లిదండ్రులను అడిగితెలుసుకున్నారు. చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీతారామయ్య పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శని (సా॥)	ఆది (ఉ॥)
6:15	4:28

అభివృద్ధే ప్రధాన అజెండా

- మన్యంలో 1270 పనులకు రూ.31.63 కోట్ల కేటాయింపు
- గడపగడపకూ వెళ్లి సమస్యల గుర్తింపు
- దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం
- రోడ్లు కాలువల నిర్మాణానికి ప్రాధాన్యం
- జిల్లాలో 1385 పనులకు ప్రతిపాదన
- 1270 పనులు మంజూరు, నిర్మాణ దశలో 1227

పార్వతీపురంటౌన్:

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. అభివృద్ధి పనులకు ప్రాధాన్యమిస్తోంది. క్షేత్రస్థాయిలో పథకాల అమలు, జరిగిన, జరగాల్సిన అభివృద్ధి పనులు తెలుసుకునేందుకు 'గడపగడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో ఎమ్మెల్యేలు, మంత్రులు స్థానిక అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్తున్నారు. సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్నారు. పల్లె ప్రజలు సూచించిన అభివృద్ధి పనుల ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్, అధికారులకు పంపిస్తున్నారు. ప్రతి సచివాలయానికి కేటాయించిన రూ.20 లక్షలతో రోడ్లు, కాలువల పనులు చేయిస్తున్నారు. దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతూ పల్లె ప్రజల్లో సంతోషం నింపుతున్నారు.

పనులు నిధులు మంజూరు ఇలా...

విభాగం	మొత్తం పనులు	మంజూరైన నిధులు (రూ.కోట్లలో)
సీసీ రోడ్లు	618	15.16
కాలువలు	358	8.48
తాగునీటి పనులు	175	4.87
కల్వర్టులు	52	1.09
విద్యుత్ పనులు	19	0.35
ఇతర పనులు	38	1.68



కొమరాడ మండలంలో పూర్తయిన సీసీ రోడ్డు

పనుల కల్పనలో మన్యం ముందజ

గడపగడపలో అందిన అర్జీలకు ప్రతిపాదించిన పనులు, నిధుల మంజూరులో రాష్ట్రంలోనే పార్వతీపురం మన్యం జిల్లా ముందంజలో ఉంది. ఇప్పటివరకు 1385 పనులు ప్రతిపాదించగా అందులో 1270 పనులు మంజూరయ్యాయి. ఇప్పటివరకు ప్రారంభించిన 1227 పనులకు రూ.31.63 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. మరో 43 అభివృద్ధి పనులు ప్రారంభించనున్నారు. కొద్ది రోజుల్లో వీటిని ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు.

పనుల గుర్తింపు ఇలా...

జిల్లాలో గుర్తించిన పనుల్లో సీసీరోడ్లు 618, కాలువలు 358, కల్వర్టులు 52, తాగునీటి సరఫరాకు 175, విద్యుత్ సంబంధిత పనులు 19, బీటీరోడ్లు 10, ఇతర పనుల 38 మొత్తం 1270 పనులు మంజూరయ్యాయి. వీటిలో 1270 పనులకు సంబంధించి పనులు ప్రారంభించారు. ఇందులో 400 పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. సమస్యల పరిష్కారానికి జీఎస్ డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక సెల్‌ను ఏర్పా టు చేశారు. ప్రజాప్రతినిధులు, స్థానిక అధికారులు గ్రామాల్లో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ఏప్పటికప్పుడు అప్లోడ్ చేసేందుకు జీఎస్ డబ్ల్యూఎస్ ప్రత్యేకాధికారిని నియమించారు.

జిల్లాలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వివరాలు ఇలా...

సచివాలయాలు:	350
శతశాతం పూర్తి చేసిన సచివాలయాలు:	173
అప్‌లోడ్ చేసిన పనులు:	1385
ప్రతిపాదించిన పనుల సంఖ్య:	1385
మంజూరైనవి:	1270
ప్రారంభించినవి:	1227
మంజరైన నిధులు:	రూ.31.63

వెంటవెంటనే అప్లోడ్ చేస్తున్నాం



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు గుర్తించిన పనుల వివరాలను అప్లోడ్ చేస్తున్నాం. జీఎస్ డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో ప్రతిరోజు పనుల నివేదికను ప్రభుత్వానికి పంపుతున్నాం. ప్రభుత్వం నుంచి ఆమోదంపొందిన పనులను సంబంధిత శాఖాధికారులకు అందజేసి తక్షణమే పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాం. – రామచంద్రరావు, జీఎస్ డబ్ల్యూఎస్ ప్రత్యేకాధికారి, పార్వతీపురం మన్యం

సమస్యల పరిష్కారానికి ప్రత్యేకసెల్ ఏర్పాటు



గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు గుర్తించిన సమస్యల పరిష్కారానికి జీఎస్ డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేశాం. వచ్చిన ప్రతిపాదనలను ఎప్పటికప్పుడు ఆమోదించి, నిధులు కేటాయిస్తున్నాం. ఇప్పటివరకు 1227 పనులు ప్రారంభించాం. మిగిలిన పనులు అతి త్వరలో ప్రారంభించేందుకు పూర్తి చర్యలు చేపట్టాం.

– నిషాంత్‌కుమార్, కలెక్టర్, పార్వతీపురం మన్యం జిల్లా



జియమ్మవలస మండలంలో రోడ్డు పనులు పరిశీలిస్తున్న అధికారులు

మర్యాదపూర్వక కలయిక



డిప్యూటీ సీఎంను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్టీసెల్ జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ డీవీజీ శంకరరావు



రాజన్నదొరను సన్మానిస్తున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యురాలు జయమణి

సాలూరు:

డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొరను సాలూరులోని ఆయన స్వగృహంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యురాలు జయమణి, ఎస్టీసెల్ జోనల్ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ డా.డీవీజీ శంకరరావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమం, పార్వతీపురం మన్యం జిల్లా అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం రాజన్నదొరను సత్కరించారు. మండలంలోని పీఎన్ బొడ్డవలసలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను జయమణి పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల మధ్య ఘర్షణలపై ఇటీవల వార్తాపత్రికల్లో వచ్చిన విషయాలపై ఆరా తీశారు. విద్యార్థుల మధ్య స్నేహపూర్వక వాతావరణం పెంపొందించి, వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు.

న్యూస్‌రీల్

అవుట్‌సోర్సింగ్ విధానంలో పోస్టుల భర్తీ



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

సీతానగరం: విద్యార్థుల చదువులు చక్కగా సాగాలన్న ఉద్దేశంతో గిరిజన విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపకుల పోస్టులను అవుట్‌సోర్సింగ్ విధానంలో భర్తీచేస్తున్నామని పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ తెలిపారు. జోగింపేట గిరిజన ప్రతిభ (స్కూల్‌ఆఫ్ ఎక్స్‌లెన్స్) విద్యాలయంలో పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, అధ్యాపకుల(టీచింగ్ స్టాఫ్) పోస్టుల భర్తీకి అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని వివిధ సబ్జెక్టులకు సంబంధించి 20 పోస్టులకు 52 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. శుక్రవారం నిర్వహించిన ఇంటర్వ్యూకు 31 మంది హాజరయ్యారని తెలిపారు. మిగిలిన వారికి శనివారం ఇంటర్వ్యూ నిర్వహిస్తామని చెప్పారు. ఇంటర్వ్యూ, ఉన్నత చదువులకు 70 మార్కులు, డెమోలో 30 మార్కులు కేటాయిస్తామన్నారు. గిరిజన ప్రతి విద్యాలయంలో ఐఐటీ, ఇంజినీరింగ్, వైద్యం తదితర ఉన్నత చదువుకు ఉపయోగలా విద్యాబోధన జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ డీడీ బి.సూర్యనారాయణ, ప్రిన్సిపాల్ పి.వెంకటనాయుడు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి


- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



వందపడకల ఆస్పత్రి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు: వందపడకల ఆస్పత్రి నిర్మాణం వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర సూచించారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఆస్పత్రిలోని రోగులతో మాట్లాడారు. వైద్యసేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించి, త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్, ప్రజారోగ్య శాఖ ఎమ్‌డీ మురళీధర్‌కు సూచించారు.

అందరూ మెచ్చేలా సినిమా తీస్తాం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చిత్ర యూనిట్

పాలకొండ: అందరూ మెచ్చేలా 'కౌసల్య తనయ రాఘవ' సినిమాను నిర్మిస్తున్నామని పాలకొండ పట్టణానికి చెందిన యువకుడు అడపా రత్నాకర్, దర్శకుడు స్వామిపట్నాయక్‌లు తెలిపారు. స్థానిక కోటదుర్గమ్మ ఆలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో పలు షార్ట్ ఫిల్మ్‌లు తీసిన అనుభవంతో ఈ సినిమా చేస్తున్నామని తెలిపారు. నిర్మాతగా రత్నాకర్, సహ నిర్మాతగా శ్యామ్ వ్యవహరిస్తున్నారన్నారు.

తోటపల్లి కాలువ పనుల పరిశీలన



కాంక్రీట్‌లో నాణ్యతా ప్రమాణాలను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

వీరఘట్టం: తోటపల్లి పాత ఆయకట్టు ఆధునీకీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను బొబ్బిలి క్వాలిటీ కంట్రోల్ డీఈ పి.లక్ష్మి శుక్రవారం పరిశీలించారు. అనంతరం కాంక్రీట్ క్యూబ్స్, స్లంప్ టెస్టులు చేశారు. రూ.193 కోట్ల వ్యయంతో చేపడుతున్న పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని సూచించారు. ఖరీఫ్‌కు సాగునీరు అందించేలా పనులు చేయిస్తున్నామని డీఈఈ రవికుమార్ తెలిపారు. ఏఈలు డీవీ రమణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూలీలను కాటేసిన మృత్యువు



ఘటనా స్థలంలో మృతి చెందిన కేంద్రిక శంకరరావు



సర్వపాడులో కూలిన గోడ

కొమరాడ: వారంతా గిరిజనులు. రెక్కాడితేగాని డొక్కాడని బతుకులు. కూలి చేయగా వచ్చిన డబ్బులే జీవనాధారం. ఊరిలో తోటి కూలీకి చెందిన పనికావడంతో ఉదయాన్నే ఉత్సాహంగా వెళ్లారు. పూరిల్లు గోడల తొలగింపు పనుల్లో నిమగ్నమయ్యారు. అంతే.. చెమట చిందిస్తున్న కూలీలను గోడ రూపంలో మృత్యువు కాటేసింది. కూలీల ఇంట విషాదాన్ని నింపింది. కొమరాడ మండలం చినఖేర్జిల పంచాయతీ సర్వపాడు గ్రామంలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు కూలీలు మృతిచెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిపాలయ్యారు. వివరాల్లోకి వెళ్తే...

సర్వపాడుకు చెందిన జీలకర్ర మాణిక్యం కూలిపనులు చేస్తూ కాసిన్ని డబ్బులు కూడబెట్టింది. పూరింటి స్థానంలో పక్కా ఇంటి నిర్మాణానికి పూనుకుంది. ఇందులో భాగంగా పూరింటి గోడలు తొలగించేందుకు తనతో పాటు ప్రతిరోజూ పనిచేసే కూలీలు కేంద్రిక శంకరరావు, మండంగి రవి, జీలకర్ర హరికృష్ణ, మెల్లిక రాజును పిలిచింది. వారితో కలిసి ఆమెకూడా పనిలో నిమగ్నమైంది. ఐదుగురూ మట్టిగోడ తొలగింపు పనిలో నిమగ్నమయ్యారు. కొందరు పలుగుతో తవ్వుతుండగా, మరికొందరు పారతో తట్టలకు మట్టి ఎత్తుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గోడలు పూర్తిగా తడిసి ఉండడంతో మట్టిగోడలు ఒక్కసారిగా కుప్పకూలిపోయాయి. అంతే.. హాహాకారాలు మిన్నంటాయి. గ్రామస్తులు పరుగున వచ్చి గోడకింద ఉన్నవారిని వెలికితీసేందుకు ప్రయత్నించారు. నలుగురిని ప్రాణాలతో బయటకు తీసి చికిత్స కోసం పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. మార్గం మధ్యలో మాణిక్యం (55) మృతిచెందింది. ఘటనా స్థలంలో మృతిచెందిన కేంద్రిక శంకరరావు(33)ను బయటకు తీశారు. ఇద్దరు కూలీలు మృతితో సర్వపాడులో విషాదం అలముకుంది. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తహసీల్దార్ సీహెచ్ రాధాకృష్ణమూర్తి, పార్వతీపురం సీఐ విజయానంద్ ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాద వివరాలపై ఆరా తీశారు. కొమరాడ ఎస్‌ఐ జగదీష్ నాయుడు కేసు నమోదు చేశారు.

జాబ్‌మేళా విజయవంతం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ

సాలూరు: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సాలూరు వైటీసీలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళా విజయవంతమైంది. మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొని జాబ్ మేళాను ప్రారంభించారు. స్కిల్ హబ్‌లలో ప్రభుత్వం ఇచ్చేశిక్షణను సద్వినియోగం చేసుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. ఉద్యోగాల్లో రాణించి ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. వివిధ కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూకు 103 మంది ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ ఎంప్లాయిమెంట్ అధికారి రవీంద్ర, సీడాప్ ప్లేస్‌మెంట్ అధికారి సురేష్, వైటీసీ మేనేజర్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

మన్యంలో బంద్ ప్రశాంతం

కురుపాం/గుమ్మలక్ష్మీపురం/సీతంపేట/కొమరాడ/భామిని/జియ్యమ్మవలస: పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజన సంఘాలు శుక్రవారం తలపెట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. బోయ, వాల్మీకి కులస్తులను ఎస్టీల్లో చేర్చవద్దంటూ వివిధ మండల కేంద్రాలు, కూడళ్లలో గిరిజన సంఘాల నాయకులు, ఆదివాసీలు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల 35 లక్షల మంది గిరిజనులకు విద్యా, ఉద్యోగ అవకాశాల్లో ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. జీఓ నంబర్ 3ను పూర్తిస్థాయిలో అమలుచేయాలని డిమాండ్ చేశారు.



సీతంపేట: సీతంపేటలోని దోనుబాయి కూడలి వద్ద బైఠాయించిన ఆదివాసీలు



కురుపాం నియోజకవర్గ కేంద్రంలో ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం నిరసనప్రదర్శన

చిరుధాన్యాలతో ఆరోగ్యం

- జిల్లాలో 4వేల ఎకరాల్లో చిరుధాన్యాల పంటలు సాగు
- 90 శాతం రాయితీపై విత్తనాలు సరఫరా
- కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం టౌన్:

చిరుధాన్యాలతో ఆరోగ్యం సిద్ధిస్తుందని, చిరుధాన్యాల సాగును ఓ ఉద్యమంలా రైతులు చేపట్టాలని కలెక్టర్ కలెక్టర్ నిషాంత్‌కుమార్ పిలుపునిచ్చారు. పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో చిరుధాన్యాల మహోత్సవంను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల జీవన విధానంలో మార్పు రావాలన్నారు. 1965 సంవత్సరంలో చిరుధాన్యాల పంటల సాగు 20 శాతం కాగా, ప్రస్తుతం 6 శాతంగా ఉందని వెల్లడించారు. తక్కువ ఆదాయవర్గాలు వారు మాత్రమే చిరుధాన్యాలు వినియోగిస్తారన్న మానసికమైన ఆలోచన వల్లే వినియోగం తగ్గిందన్నారు. చిరు ధాన్యాల ఉత్పత్తి పెంచాలని, దీనికి వ్యవసాయశాఖ సరైన మార్గదర్శత్వం ఇవ్వాలన్నారు.

- జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యానికి చిరు ధాన్యాలు చాలా అవసరమన్నారు. ఆరోగ్యం బాగుంటే ఆర్థికంగా బాగుంటుందని చెప్పారు. చిరుధాన్యాల వినియోగం ప్రజలకు ఎంతో అవసరం ఉందన్నారు.



చిరుధాన్యాల మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

మద్దతు ధర కల్పన

చిరుధాన్యాలకు మద్దతు ధర కల్పిస్తున్నట్టు జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్ తెలిపారు. జిల్లాలో 4 వేల ఎకరాల్లో చిరుధాన్యాల పంటలు సాగవుతున్నాయని చెప్పారు. రబీ సీజన్‌లో 4 వందల ఎకరాల్లో పంట సాగులో ఉందన్నారు. రైతులకు 90 శాతం రాయితీపై విత్తనాలు సరఫరా చేస్తున్నట్టు వెల్లడించారు.

- జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె.విజయగౌరి మాట్లాడుతూ ఆహారం మార్పుచెందడంతో అనేక రకాల వ్యాధులబారిన పడుతున్నామన్నారు. చిరుధాన్యాలు తీసుకుంటే అన్ని విటమిన్లు లభిస్తాయని, శారీరక దారుఢ్యం కలుగుతుందని చెప్పారు. కొర్రలు, సామలు, అండు కొర్రలు, ఊదలు, అరికెలులో పోషకాలు మెండుగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలను సాగు చేస్తున్న రైతులను జ్ఞాపికలతో సత్కరించారు. టీపీఎంయూ ఏపీడీ వై.సత్యంనాయుడు, రస్తాకుంటుబాయి కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త తేజేశ్వరరా వు, ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు కృషి

పార్వతీపురం: జిల్లా ప్రజల్లో రక్తహీనత నివారణకు వైద్యాధికారులు కృషిచేయాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులతో వీడియో కాన్ఫరెన్స్‌లో శుక్రవారం మాట్లాడారు. మక్కువ, పెదంకలం, ఎం.సింగుపురం, బాలేరు, శంబర, అరసాడ తదితర పీహెచ్‌సీల పరిధిలో అందుతున్న సేవలపై పర్యవేక్షించి నివేదిక అందజేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. రక్త హీనత పరీక్షలపై నిర్లక్ష్యం వహిస్తున్న ఏఎన్ఎంలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. కిశోర బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. టీకాల కార్యక్రమం (ఇమ్యునైజేషన్) శతశాతం జరగాలని, ప్రతి ఒక్కరి వద్ద టీకాల కార్డు ఉండాలని స్పష్టం చేశారు.

జిల్లాలో మలేరియా కారకదోమల నివారణ మందును మే 15 నుంచి పిచికారీ చేయిస్తామని ఇన్‌చార్జి మలేరియా నివారణ అధికారి డా.శ్యామ్ కుమార్ తెలిపారు. పీహెచ్‌సీలకు వేసే రోడ్లు, భవనాలు శాఖ చేపడుతున్న పనులపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో డీఎంహెచ్‌ఓ డా.బగాది జగన్నాథరావు, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డా.బి.వాగ్దేవి, ఆర్.బి.ఎస్.కె.ప్రాజెక్టు అధికారి డా.ధవళ భాస్కరరావు, ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డీవీ రమణ, ప్రోగ్రాం అధికారులు వినోద్, టి.జగన్మోహనరావు, శ్యామ్‌కుమార్, ఆర్‌అండ్‌బీ కార్యనిర్వహణ ఇంజినీర్ ఎం.జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలీస్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి



పోలీస్ సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: పోలీసు ఉద్యోగుల సంక్షేమానికి జిల్లా పోలీసు శాఖ కృషిచేస్తుందని ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీస్ వెల్ఫేర్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది సమస్యలను ఆమె విని, పరిష్కారానికి గాను సంబంధిత అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తంపటాపల్లిలో విజిలెన్స్ తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

పాలకొండ రూరల్: మండలంలోని తంపటాపల్లి గ్రామంలో గల అనాథపిల్లల ఆశ్రమాన్ని విజిలెన్స్ ఎస్పీ సురేష్‌బాబు ఆదేశాల మేరకు ఆశాఖ ఎస్సై బి. రామారావుతో పాటు సిబ్బంది శుక్రవారం పరిశీలించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న పిల్లల వివరాలను నిర్వాహకుల ద్వారా అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. పిల్లలకు అందుబాటులో ఉంచిన సౌకర్యాలపై ఆరా తీశారు. తాము సేకరించిన నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని విజిలెన్స్ ఎస్సై తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతికుమారి, సిబ్బంది లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కారుణ్య నియామకాల భర్తీ

విజయనగరం టౌన్: ఆర్టీసీలో కారుణ్య నియామకాలకు సంబంధించి పోస్టులు భర్తీ చేయనున్నట్లు శ్రీకాకుళం జిల్లా ప్రజారవాణాధికారి ఆకాశపు విజయకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెక్ రీజియన్ పరిధిలో విజయనగరం, శ్రీకాకుళాలకు సంబంధించి ఇప్పటికే కొందరికి ఉద్యోగాలు ఇచ్చామన్నారు. మిగిలిన వాటిలో జూనియర్ అసిస్టెంట్, కండక్టర్, శ్రామిక్ పోస్టులను ప్రస్తుతం వారి అర్హతలను బట్టి భర్తీచేసేందుకు సన్నాహాలు చేపట్టామని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

దొంగనోట్ల కేసులో ఆరుగురికి జైలుశిక్ష

బొబ్బిలి: దొంగనోట్ల చలామణీలో ఆరుగురు వ్యక్తులకు జైలుశిక్ష వేస్తూ సబ్ జడ్జి టి.వాసుదేవన్ శుక్రవారం తీర్పు వెలువరించినట్టు ఏపీపీ మజ్జి జగన్నాథం తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరుకు చెందిన బూరాడ సూర్యనారాయణ దొంగనోట్లు కలిగి ఉన్నందుకు, వాటిని చలామణీ చేసినందుకు ఐదేళ్ల చొప్పున జైలుశిక్ష, ఐదు వేల రూపాయల జరిమానా, రెండు కేసుల్లోనూ ఉన్నందుకు మరో రెండేసి వేల జరిమానాను విధించారన్నారు. అలాగే కేవలం దొంగనోట్లు కలిగి ఉన్నందుకు బూరాడ గురమ్మ, బూరాడ చంద్రమ్మ, సీహెచ్ నూకారెడ్డి, కొప్పిశెట్టి శ్రీనివాసరావు, దాసరి సత్యనారాయణలకు ఐదేళ్ల జైలు శిక్ష, రెండు వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారన్నారు. 2010లో నమోదైన ఈ కేసులో ఏడుగురు నిందితులు కాగా వీరిలో కంటు వెంకటమ్మ అనే మహిళ గతంలోనే మృతి చెందినట్టు ఏపీపీ జగన్నాథం తెలిపారు.

ఐటీ యాక్ట్ కేసు నమోదు

విజయనగరం క్రైమ్: గుర్తు తెలియని వ్యక్తులు తన ఖాతా నుంచి నగదును విత్‌డ్రా చేసినట్లు కామరాజు అనే వ్యక్తి వన్‌టౌన్‌పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. కామరాజు అకౌంట్‌నుంచి ఆయనకు తెలియకుండా ఒకసారి రూ. 25వేలు, మరోసారి రూ.20వేలు మొత్తం రూ.45వేలు విత్ డ్రా అయినట్లు మెసెజ్‌లు రావడంతో పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు.

రామకోటి ప్రతుల సమర్పణ



రామకోటి ప్రతులను సమర్పిస్తున్న భక్తులు

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన రామనారాయణంలో భక్తులు రాసిన రామకోటి ప్రతులను రామస్థూపంలో శుక్రవారం భద్రపరిచారు. రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన భక్తులు శుక్రవారం నాటికి 22 కోట్ల 4 లక్షలకు పైగా రామకోటి నామాల ప్రతులను అందజేశారని ఆలయ ట్రస్టీ నారాయణం శ్రీనివాస్ తెలిపారు.

నదిలో గల్లంతైన యువకుడి మృతి

• కడకెల్ల తీరంలో లభ్యమైన మృతదేహం



కార్తీక్ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు



మృతదేహం లభ్యమైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ సత్యనారాయణ

వీరఘట్టం: నాగావళి నదిలో గల్లంతైన పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన యువకుడు అన్ను కార్తీక్(17) మృతదేహం మృతదేహం వీరఘట్టం మండలం కడకెల్ల సమీపంలోని నదీ తీరంలో శుక్రవారం లభ్యమైంది. గురువారం నదిలో గల్లంతైన కార్తీక్ జాడకోసం 24 గంటలుగా వెతుకున్న బంధువులకు మృతదేహమై కనిపించడంతో అంతా కన్నీటి పర్యంతమయ్యారు. అయితే నదిలో తరచూ జరుగుతున్న ఇసుక తవ్వకాల వల్ల ఎక్కడ గోతులు ఉన్నాయో తెలియపోవడంతోనే కార్తీక్ నీట మునిగి ప్రాణాలు వదిలాడని బంధువులు, గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ద్వారపురెడ్డి ధనుంజయరావులు రోదించారు. ఇక్కడ ఇసుక తవ్వకాలు చేపట్టేవారిపై కేసు నమోదు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు. అనంతరం ఎల్విన్‌పేట సీఐ పి.సత్యనారాయణ సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి మృతుని కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. మృతుని తండ్రి వెంకట్ ఫిర్యాదుపై ఇన్‌చార్జ్ ఎస్సై కిశోర్‌వర్మ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

డివైడర్‌ను ఢీకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి..

భోగాపురం: విజయనగరం జిల్లా గరివిడి మండలం శేరీపేట గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పొట్నూరి రాజేష్ (23) డివైడర్‌ను ఢీకొని శుక్రవారం మృతి చెందాడు. భోగాపురం మండలంలోని రాజాపులోవ జాతీయ రహదారిపై జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. పొట్నూరి రాజేష్ కొమ్మాదిలో నివాసముంటూ విశాఖపట్నం బీచ్ రోడ్డులో ఉన్న మౌలిటెక్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ (టీం మెంబర్) ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం స్నేహితుడు మూడుముళ్ల సురేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై విజయనగరం జిల్లా జొన్నాడ గ్రామంలో ఉన్న మరో స్నేహితుడు మొమ్ములూరి దినేష్ ఇంటికి వచ్చాడు. ముగ్గురు స్నేహితులు రోజంతా సరదాగా గడిపి రాత్రికి అక్కడే ఉండిపోయారు. శుక్రవారం వేకువజామునే రాజేష్, సురేష్‌లు ద్విచక్ర వాహనంపై విశాఖపట్నం బయల్దేరారు. రాజాపులోవ వద్దకు చేరుకునేసరికి బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో కింద పడిపోగా రాజేష్ తలకు గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సురేష్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భోగాపురం సీహెచ్‌సీకి తరలించారు. పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న మృతుని తల్లిదండ్రులు ఆస్పత్రి వద్దకు చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. మృతుడి తండ్రి సూర్యనారాయణ ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తవుడు తెలిపారు.



పొట్నూరి రాజేష్ (ఫైల్)

జి–20 సదస్సుతో విశాఖకు మరింత గుర్తింపు



మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పక్కన ఎమ్మెల్యే శంబంగి

• ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

రామభద్రపురం: మూడు రోజుల పాటు నిర్వహించిన జి–20 సదస్సు ద్వారా విశాఖ నగరానికి మరింత గుర్తింపు లభించిందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడుతో కలిసి శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విశాఖలో నిర్వహించిన జి–20 సదస్సుకు 40 నుంచి సుమారు 200 మంది విదేశీ ప్రతినిధులు హాజరయ్యారని వారి పర్యటన ద్వారా విశాఖ నగరానికి ప్రపంచ స్థాయిలో కీర్తి ప్రతిష్టలు పెరిగాయన్నారు. ఇటీవల పలువురు పారిశ్రామిక ప్రతినిధులు వచ్చి విశాఖలో పెట్టుబడులు పెట్టి పరిశ్రమల ఏర్పాటుకు ముందుకువచ్చారన్నారు. దీంతో విశాఖపట్నం పరిపాలన రాజధానికి అనుకూలమని తేలిపోయిందన్నారు. ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవచూపుతున్నారన్నారు. కాబోయే పరిపాలనా రాజధాని విశాఖపట్నం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, శంబంగి వేణుగోపాలనాయుడు, అప్పికొండ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

సజావుగా పీడీఎస్ బియ్యం వేలం

• సహాయ పౌర సరఫరాల శాఖాధికారి అశోక్ సమక్షంలో పాట



తెర్లాంలో జరిగిన సీజ్ చేసిన పీడీఎస్ బియ్యం వేలంపాటలో పాల్గొన్న ఔత్సాహికులు, అధికారులు

తెర్లాం: జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్‌లో శుక్రవారం నిర్వహించిన సీజ్‌చేసిన పీడీఎస్ బియ్యం వేలం పాట సజావుగా జరిగింది. జిల్లా సహాయ పౌర సరఫరాల శాఖ అధికారి(ఏఎస్ఓ) బి.అశోక్ సమక్షంలో తహసీల్దార్ దోల రాజేశ్వరరావు, సీఎస్‌డీటీ గాడి భాస్కరరావులు సీజ్ చేసిన 428.5క్వింటాళ్ల పీడీఎస్ బియ్యానికి వేలం వేశారు. ఈ వేలంపాటలో విజయనగరం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి ఔత్సాహికులు పాల్గొన్నారు. జేసీ ఆదేశాల మేరకు కిలో బియ్యం ధర రూ.20లుగా నిర్ణయించి వేలంపాట ప్రారంభించగా బాడంగికి చెందిన ఉప్పల హరి కిలో బియ్యం రూ.22.30లకు పాడగా, బొబ్బిలికి చెందిన కోరాడ శ్రీనివాసరావు అదనంగా మరో10పైసలు వేసి కిలో బియ్యం రూ.22.40ల చొప్పున పాడుకున్నాడు. ఆ తరువాత మరెవరూ పాడకపోవడంతో కిలో రూ.22.40లు చొప్పున 428.5క్వింటాళ్లు పాటదారుకు చెందినట్లు అధికారులు ప్రకటించారు. వేలం పాటలో డీఎస్ఓ కార్యాలయ సీఎస్‌డీటీ గణపతిరావు, తెర్లాం ఎంఎల్ఎస్ పాయింట్ గోదాము ఇన్‌చార్జ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయువు తీసిన అక్రమ క్వారీ

• టీడీపీ నేత అక్రమ గ్రావెల్ క్వారీలో ప్రమాదం
• పనికి వెళ్లిన డిగ్రీ విద్యార్థి మృతి
• విషాదంలో కుటుంబ సభ్యులు



అక్రమ గ్రావెల్ క్వారీలో రక్తపు ఆనవాళ్లు



గారపేట–రెడ్డిపేట రహదారిపై బైఠాయించిన కుటుంబీకులు, గ్రామస్తులు



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

బగాది మణికంఠ (ఫైల్)

పొందూరు/సంతకవిటి: టీడీపీ నేతకు చెందిన అక్రమ క్వారీ ఓ విద్యార్థి మృతికి కారణమైంది. ఆ కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చింది. ఈ విషాద ఘటన పొందూరు మండలం వీఆర్‌గూడెంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతకవిటి మండలం జీఎన్‌పురం గ్రామానికి చెందిన బగాది మణికంఠ(20) శ్రీకాకుళంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో బీఎస్సీ (ఎంపీసీ) ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి లేకపోవడంతో తల్లి వెంకటలక్ష్మి కూలి పని చేస్తూ కుమారుడుతో పాటు కుమార్తె శారదను చదివిస్తోంది. సెలవులు రావడంతో నాలుగు రోజుల క్రితం మణికంఠ పొందూరు మండలంలోని వావిపల్లిపేటలో ఉంటున్న తాతయ్య సింహాచలం ఇంటికి వచ్చాడు. చేతి ఖర్చుల కోసం ఎవరిపైనా ఆధారపడకుండా అప్పుడప్పుడు గ్రావెల్ క్వారీ తవ్వకాల్లో పనికి వెళ్తుండేవాడు. వావిలపల్లిపేట సమీపంలోని వీఆర్‌గూడెంలో టీడీపీ నాయకుడు సువ్వారి మధుసూదనరావు అక్రమ గ్రావెల్ క్వారీ నిర్వహిస్తున్నాడు. అందులో గ్రావెల్ తీసుకెళ్లే వాహనాల నమోదు చేసే పని కోసం మణికంఠ గురువారం రాత్రి అక్కడికి వెళ్లాడు. పనిలో ఉన్న మణికంఠ పైనుంచి క్వారీ లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి జరగ్గా, క్వారీ నిర్వాహకులు మాత్రం శుక్రవారం తెల్లవారుజామున 5.30 గంటలకు కుటుంబ సభ్యులకు తెలియజేశారు.

గుట్టురట్టు కాకుండా...

అక్రమ క్వారీలో జరిగిన ప్రమాదంలో యువకుడు చనిపోవడంతో మైనింగ్, పోలీసు డిపార్ట్‌మెంట్ల నుంచి కఠిన చర్యలు తప్పవని భావించిన నిర్వాహకులు గుట్టురట్టు కాకుండా ప్రయత్నాలు చేశారు. ఘటనా స్థలాన్ని మార్చేందుకు వ్యూహరచన చేశారు. క్వారీలో కాకుండా వేరే చోట ప్రమాదం జరిగినట్లు చిత్రీకరించేందుకు ఏర్పాట్లు చేశారు. మృతదేహాన్ని కిలోమీటరు దూరం తీసుకువచ్చి జేవీఆర్ క్రషర్‌కు 100 మీటర్ల దూరంలోకి లారీని తీసుకువచ్చి మృతదేహాన్ని లారీ కింద పెట్టేశారు.

కుటుంబీకుల ధర్నా..

యువకుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. యువకుడు క్వారీలోనే చనిపోయాడని, కావాలనే అక్కడి నుంచి మృతదేహాన్ని తీసుకువచ్చి పడేశారని మండిపడ్డారు. అక్రమ క్వారీల నిర్వహణతో ఎంతోమంది ప్రాణాలను పొట్టన పెట్టుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ క్వారీలను, మైనింగ్‌లను వెంటనే మూసివేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ గారపేట–రెడ్డిపేట రహదారిలో ధర్నా చేపట్టారు. పొందూరు–చిలకపాలెం ప్రధాన రహదారి కావడంతో సుమారు రెండు కిలోమీటర్ల మీరకు వాహనాలు నిలిచిపోయాయి. కలెక్టర్, ఎస్పీ వచ్చి తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు.

నిర్వాహకులపై కేసు నమోదు..

మృతుడు మణికంఠ తల్లి బగాది వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అక్రమ క్వారీ నిర్వాహకుడు సువ్వారి మధుసూదనరావు, లారీ డ్రైవర్ నాగరాజు, మరికొంత మంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. గురువారం రాత్రి డ్రైవర్ నాగరాజు లారీని అజాగ్రత్తగా నడిపి మణికంఠ తలపైకి ఎక్కించడంతో ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. అక్రమ మైనింగ్ స్థలం అధికారులకు తెలిసిపోతుందనే భయంతో ఘటనా స్థలాన్ని మార్చేందుకు నిర్వాహకులు ప్రయత్నించారని తెలిపారు. సంఘటన స్థలాన్నే తారుమారు చేశారని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

బ్రిందా ఆస్పత్రితో సెంచూరియన్ ఎంఓయూ



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ఇరు సంస్థల ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: విశాఖపట్నానికి చెందిన బ్రిందా ఆస్పత్రితో టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీ శుక్రవారం ఎంఓయూ కుదుర్చుకుంది. ఆస్పత్రి ఎం.డి వంశీధర్, వర్సిటీ వీసీ జీఎస్ఎన్ రాజులు ఈ మేరకు పరస్పర అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థుల ఇంటర్న్‌షిప్, సదస్సుల నిర్వహణ తదితర అంశాలకు ఎంఓయూలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150–00
బంగారం(22సి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹ 190

సీతం కళాశాలలో 'హ్యాకథాన్' సదస్సు

• 5నుంచి 8వ తేదీ వరకు నిర్వహణ

విజయనగరం అర్బన్: గాజులరేగలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు 'స్మార్ట్ విజయనగరం' అనే అంశంపై 'హ్యాకథాన్' సదస్సు నిర్వహిస్తున్నామని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు సదస్సు షెడ్యూల్‌ను విడుదల చేశారు. కళాశాల విద్యార్థులు రూపొందించిన 'ఒన్ వెబ్ డెవలెప్‌మెంట్' ప్రోగ్రాంను ఈ సదస్సులో విడుదల చేస్తామని చెప్పారు. జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (వీసీ) ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యే ఈ సదస్సులో వివిధ యూనివర్సిటీలకు చెందిన ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. నాలుగురోజుల పాటు జరిగే ఈ సదస్సుకు ఉత్తరాంధ్ర జిల్లాల విద్యార్థులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామమూర్తి, కంప్యూటర్ సైన్స్ విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీబీ మందుల వాడకం పరిశీలన

విజయనగరం ఫోర్ట్: క్షయ రోగులు మందులు వాడుతున్నది లేనిది క్షేత్ర స్థాయిలో పర్యటించి తెలుసుకోవాలని జిల్లా క్షయనివారణ అధికారి డాక్టర్ ఎస్. సూర్యనారాయణ తెలిపారు. ఈ మేరకు స్థానిక జిల్లా క్షయ నివారణ కేంద్రంలో శుక్రవారం సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కఫం పరీక్షల కోసం వచ్చిన వారికి సకాలంలో చేసి రిపోర్టులు అందజేయాలని, క్షయ రోగులందరికీ హెచ్ఐవీ పరీక్షలు చేయాలన్నారు. వృత్తి పట్ల చిత్తశుద్ధితో పనిచేయాలని హితవు పలికారు.

జేసీకి ఎంఆర్‌పీఎస్ వినతి పత్రం



వినతి పత్రాన్ని అందుకుంటున్న జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్:

ఉషామెహర్ కమిటీ నివేదిక సమర్పించిన నేపథ్యంలో ఎస్సీలను ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరించే ప్రక్రియ పూర్తి చేయాలని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా కమిటీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు జిల్లా కమిటీలు శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారులోకి వచ్చిన 100 రోజుల్లోనే ఎస్సీల వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చారని ఇంతవరకు అమలు కాలేదన్నారు. బీజేపీ ఇచ్చిన మాట ప్రకారం పార్లమెంట్ ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని జేసీ మయూర్ అశోక్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భోగి శ్రీను మాదిగ, ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు అప్పారావు మాదిగ, శంకరరావు మాదిగ, సాంబమూర్తి మాదిగ, నాగేశ్వరరావు మాదిగ, కిషోర్, సాగర్, రవి మాదిగ పాల్గొన్నారు.

వ్యక్తి హత్య

• కోడలు, ప్రియుడు కలిసి చంపేశారని మృతుడి తండ్రి ఫిర్యాదు



మృతుడు శ్రీను (ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గంట్యాడ:

మండలంలోని బుడతానపల్లి గ్రామానికి చెందిన దాసరి శ్రీను (26) హత్యకు గురయ్యాడు. ఈ ఘటనపై పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీరామనవమి సందర్భంగా పోరుగు గ్రామంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు చూసేందుకు శ్రీను బైక్‌పై గురువారం వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. శుక్రవారం ఉదయం పెణసాం జంక్షన్ వద్ద శ్రీను చనిపోయి పడి ఉండడంతో అటుగా వెళ్లిన స్థానికులు గమనించి మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెంది ఉంటాడని అందరూ భావించారు. అయితే కొడుకు మృతి చెందిన విషయం తెలుసుకున్న శ్రీను తల్లిదండ్రులు వచ్చి మృతదేహాన్ని పరిశీలించగా శరీరంపై, తలపైన గాయాలు ఉండడంతో తన కొడుకు భార్య, మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుని వారిద్దరూ కలిసి తమ కొడుకును హత్య చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి వచ్చిన సీఐ తిరుపతిరావు, ఎస్సై కిరణ్‌కుమార్ నాయుడు సంఘటన స్థలాన్ని, మృత దేహాన్ని పరిశీలించారు. హతుడు శ్రీను స్వస్థలం వేపాడ మండలంలోని సోంపురం. అత్తవారి ఊరైన బుడతానాపల్లి గ్రామానికి ఇల్లరికం వచ్చాడు. మృతుడికి భార్య, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు.

పెట్రోల్ పోసుకుని వ్యక్తి ఆత్మహత్య

కొత్తవలస: అనారోగ్యం కారణంగా మనస్తాపానికి గురైన మండలంలోని దేశపాత్రునిపాలెం గ్రామానికి చెందిన నక్క శ్రీను(48) పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని శుక్రవారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ ఎస్.బాలసూర్యారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీను కొద్ది రోజులుగా మెదడుకు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం తెల్లవారుజామున బాత్‌రూమ్‌లోకి వెళ్లి అప్పటికే అక్కడ దాచుకున్న పెట్రోల్‌ను వంటి మీద పోసుకుని నిప్పు పెట్టుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అప్రమత్తమై విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి ఒక పాప, బాబు ఉన్నారు.



కొత్తవలస: ఆత్మహత్యకు పాల్పడిన శ్రీను (ఫైల్)

పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం/సీతానగరం: మద్యం తాగవద్దని తండ్రి మందలించినందుకు మనస్తాపం చెందిన సీతానగరం మండలం బుడ్డిపేట గ్రామానికి చెందిన బి. నాగరాజు పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని స్థానికులు గమనించి సీతానగరం పీహెచ్‌సీకి చికిత్సకోసం తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పార్వతీపురం: చికిత్స పొందుతున్న నాగరాజు